అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు

జన్నారం, ఏప్రిల్ 26 : జన్నారం మండలం దేవునిగూడ గ్రామానికి చెందిన అల్లి నాగయ్యపై అడవి పంది దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా, అడవి పంది దాడిచేసింది. అతడు బిగ్గరగా అరవడంతో అక్కడే పొలాల్లో పనులు చేస్తున్నవారు వచ్చి, పందిని తరిమికొట్టారు. నాగయ్యను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మూడుచోట్ల పక్కటెముకలు విరిగినట్లు, ప్రస్తుతం పరిస్థితి బాగానే ఉన్నట్ల బంధువులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ ఖాలిక్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 26 : కాగజ్‌నగర్ మండలం బారెగూడ గ్రామంలో మందాడి రాజయ్యకు చెందిన ఇంట్లో శుక్రవారం చిన్న గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైనట్లు ఎంఆర్ఐ ఖాలిక్ తెలిపారు. దీంతో ఇంట్లోని సామగ్రి, బంగారం, వెండి గొలుసులు, నగదు మొత్తంగా సుమారు రూ.12 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

నస్పూర్, ఏప్రిల్ 26 : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా రెండో రోజు శుక్రవారం ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పదోతరగతిలో 639 మందికి 530.., ఇంటర్‌లో 1141 మందికి 976 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 26 : అంబేద్కర్ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మే డే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బానేశ్, నాయకులు చిప్పకుర్తి నర్సయ్య, రేగుంట వెంకటి, మాడుగుల నవీన్, మల్లేశ్, సత్తయ్య, కోకిల సది, రత్నం, సుమన్, అశోక్, శ్రీనివాస్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

రక్షణపై ఉద్యోగులకు అవగాహన

సేఫ్టీ జీఎంను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట, ఏప్రిల్ 26 : మందమర్రి ఏరియాలోని కాసిపేట–1 గనిపై శుక్రవారం సింగరేణి ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘు కుమార్, ఎస్‌వోఎం భూ శంకరయ్య ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం సేఫ్టీ జీఎంను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, పిట్ సహాయ కార్యదర్శి పార్వతి సురేశ్, సేఫ్టీ కమిటీ సభ్యులు ఆడెపు రవీందర్, రఘురాం, జాడి తిరుపతి, రాజన్న, ఆంజనేయులు, సతీశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం సందర్శన

మందమర్రి రూరల్, ఏప్రిల్ 26 : మందమర్రి మండలం సారంగపల్లిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన వరిధాన్యం వివరాలు తెలుసుకున్నారు. బస్తా ధాన్యం 42.200 కిలోల చొప్పున తూకం వేస్తున్నారని, దాంతో నష్టపోవాల్సి వస్తున్నదని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్తాకు 41 కిలోల ధాన్యం మాత్రమే తూకం వేయాలని, ఎక్కువ తూకం వేస్తే రైతులు నష్టపోతారని మిల్లర్లుకు కూడా ఈ విషయం తెలియజేస్తానన్నారు.

28న జనరల్ బాడీ సమావేశం

మాట్లాడుతున్న ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26 : నస్పూర్‌కాలనీ నర్సయ్య భవన్‌లో 28న ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య తెలిపారు. శ్రీరాంపూర్ ఆర్కే–7 గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదాతో కలిసి మాట్లాడారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్, సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కే శంకర్ హాజరవుతారని తెలిపారు. బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, పిట్ కార్యదర్శి మురళీచౌదరి, రవీందర్, నర్సింగారావు, దాడి రాజయ్య, సదానందం, మోతె లచ్చన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రెబ్బెన, ఏప్రిల్ 26 : రెబ్బెన మండలం ఇందిరానగర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిర్పూర్(టీ) మండలం చిల్లపల్లి గ్రామానికి చేందిన వసాక భిక్షపతి(29) మృతిచెందినట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రెబ్బెన మండలం గంగాపూర్‌లో బంధువుల ఇంట్లో వివాహానికి వసాక భిక్షపతి, గుర్లే పరశురాం స్కూటీపై బయల్దేరారు. ఇందిరానగర్ సమీపంలో వీరిని గుర్తుతెలియన వాహనం ఢీ కొట్టింది. ఇద్దరికీ గాయాలవగా రెబ్బెన పీహెచ్‌సీకి తరలించారు. భిక్షపతి పరిస్థితి విషమంగా ఉండడంతో బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, అప్పటికే మృతిచెందినటుల వైద్యులు నిర్ధారించారు. భిక్షపతి తల్లి వసాక గిరిజాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నటుల ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

తాండూర్, ఏప్రిల్ 26 : మందమర్రికి చెందిన ధరణి తిరుపతికి చెందిన లారీలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా, పట్టుకొని సీజ్ చేసినట్లు తాండూర్ ఎస్ఐ జగదీష్‌గౌడ్ తెలిపారు. కాళేశ్వరం నుంచి రెబ్బెనకు శుక్రవారం ఇసుక తరలిస్తుండగా, తాండూర్‌లో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేశామని తెలిపారు.

తాండూర్ : ఓటర్ స్లిప్‌ల పంపిణీని పరిశీలిస్తున్న డీటీ వీవీఆర్‌కేడీ ప్రసాద్



హాజీపూర్ : ముల్కల్లలో ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తున్న ఏఆర్వో రాములు

దండేపల్లి : మాట్లాడుతున్న తహసీల్దార్ సంధ్యారాణి

ఓటర్ స్లిప్‌ల పంపిణీ

తాండూర్, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రం, బూత్‌ల వివరాలతో కూడిన ఓటర్ స్లిప్‌లను ఆయా గ్రామాల్లో ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో బీఎల్వోలు శుక్రవారం పంపిణీ చేశారు. ఓటర్ స్లిప్‌లతో పాటు, ఓటింగ్ విధానంపై సమాచారాన్ని అందిస్తున్నారు. మండల కేంద్రంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలు, ఓటర్ స్లిప్‌ల పంపిణీని డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్ పరిశీలించారు. గిర్దావార్ మురళీధర్‌రావు, రెవెన్యూ సిబ్బంది దిగంబర్, బీఎల్వోలు తదితరులు ఉన్నారు.

ముల్కల్లలో..

హాజీపూర్, ఏప్రిల్ 26 : మండలలోని ముల్కల్ల గ్రామంలో రానున్న ఎన్నికల సందర్భంగా మంచిర్యాల ఏఆర్వో, ఆర్డీవో రాములు ఇంటింటా ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. ఏఆర్వో మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం డీటీ గడియారం శ్రీహరి, హాజీపూర్ డీటీ హరిత తదితరులున్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి, ఏప్రిల్ 26 : దండేపల్లి తహసీల్ కార్యాలయంలో బీఎల్వోలకు తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్ ఓటరు స్లిప్‌లను అందజేశారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం చాలా ముఖ్యమైందని, ప్రతి ఒక్క ఓటరుకూ తప్పనిసరిగా అందించాలని బీఎల్వోలకు సూచించారు. పోలింగ్ రోజున తప్పకుండా ఓటు వేసేలా చైతన్యపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయ, ఎంపీవో శ్రీనివాస్ తదితరులున్నారు.

కూలీలకు రూ.300 వచ్చేలా చూడాలి

- మంచిర్యాల డీఆర్డీవో కిషన్
- గొర్లపల్లిలో ఉపాధి పనుల పరిశీలన

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్

వేమనపల్లి, ఏప్రిల్ 26 : ఉపాధి హామీ కూలీలందరికీ రూ.300 వచ్చేలా కొలతల ప్రకారం పనులను చేయించాలని మంచిర్యాల డీఆర్డీవో కిషన్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలోని గొర్లపల్లిలో ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మస్టర్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు ఎక్కువగా ఉన్నందున పనులు జరిగే చోట నీడ, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఉదయం 10 గంటల్లోగా పనులు పూర్తిచేసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట అడిషనల్ డీఆర్డీవో దత్తారావు, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఏఈ రాజేశ్వర్, ఈసీ మధుకర్, కార్యదర్శులు తదతరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి పోచమ్మగడ్డ చెక్‌పోస్టు సందర్శన

బెల్లంపల్లిరూరల్, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లి పోచమ్మగడ్డ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ సందర్శించారు. వాహనాల తనిఖీ తీరును బెల్లంపల్లి రూరల్ సీఐ అప్జ లొద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల వివరాలను తెలుసుకున్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. చెక్‌పోస్టు మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సుతో పాటు పలు వాహనాలను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. డీసీపీ వెంట బెల్లంపల్లి టూ టౌన్ ఎస్ఐ డీ రమేశ్ తదితరులు ఉన్నారు.

బెల్లంపల్లి రూరల్ : పోచమ్మగడ్డ పోలీస్ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీసీపీ అశోక్‌కుమార్

సీసీసీలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

నస్పూర్‌లో..

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 26 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సీసీసీ నస్పూర్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో సీసీసీ ప్రాంతంలోని ప్రధాన రోడ్డుపై వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జితేందర్ సింగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన ఉండాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 26 : బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రాణి సూచించారు. మండలంలోని చిలాటిగూడలో శుక్రవారం ఉపాధి కూలీలకు ఆర్థిక అక్షరాస్యత, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఎండ్లు నిండిన తర్వాతనే పెండ్లి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ రాజేశ్వరి, ఫైనాన్షియల్ లిటరసీ సాగర్, కార్యదర్శి సుమలత, బీసీ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధి హామీ కూలీలు

శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ

వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

- బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ
- జీఎం కార్యాలయంలో శిబిరం ప్రారంభం

రెబ్బెన, ఏప్రిల్ 26 : సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ సూచించారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో శుక్రవారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మే 20వ తేదీ వరకు నిర్వహించే ఈ శిబిరంలో విద్యార్థులు ప్రతి రోజూ హాజరై, క్రీడల్లో కొత్త విషయాలను తెలుసుకోవాలని సూచించారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలకు సంబంధించి శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం(సీహెచ్‌పీ) భీంరావుజాడే, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్, సీనియర్ పీవో ప్రశాంత్, సివిల్ సూపర్‌వైజర్ వెంకటేశ్, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ మురహరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఏసీ మెకానిక్‌ల నిర్బంధం

బెల్లంపల్లిరూరల్, ఏప్రిల్ 26 : బెల్లంపల్లి పట్టణంలోని కాల్‌టెక్స్‌లో గల ఎస్ఆర్ఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఏసీ రిపేర్ చేసేందుకు వచ్చిన సమీర్, ఆసిఫ్ ముస్తఫాపై బార్ ఓనర్‌తో పాటు అతని స్నేహితులు దాడి చేసి, గదిలో నిర్బంధించిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సమీర్, ఆసిఫ్‌ముస్తఫా గురువారం బార్ అండ్ రెస్టారెంట్‌లో ఏసీ రిపేర్ చేసేందుకు వచ్చారు. అనంతరం బార్ ఓనర్ రవి, అతని స్నేహితులు రాజ్‌కుమార్, చిరంజీవి గొడవపడ్డారు. దీంతో వారిని కొట్టి చంపుతామంటూ బెదిరించి, అక్కడే ఓ గదిలో తాళం వేసి నిర్బంధించారు. బాధితులు సమీర్, ఆసిఫ్ ముస్తఫా డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే టూ టైన్ ఎస్ఐ డీ రమేశ్ ఆదేశాలతో పోలీసులు బార్‌కు చేరుకున్నారు. గదిలో ఉన్న వారిని బయటకు తీసుకువచ్చారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు బార్ ఓనర్ రవి అతని స్నేహితులు రాజ్‌కుమార్, చిరంజీవిపై కేసు నమోదు చేసినటుల పోలీసులు తెలిపారు.

గదిలో నిర్బంధంలో ఉన్న మెకానిక్‌లు

చట్ట వ్యతిరేక నేరాలపై ఉక్కుపాదం

- పీడీ యాక్ట్ అమలుకు జాబితా సిద్ధం
- రామగుండం సీపీ శ్రీనివాస్

రామగుండం సీపీ ఎం శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 26 : చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే ఎంతటివారైనా ఉక్కుపాదం మోపుతామని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రామగుండం కమీషనరేట్ పరిధిలో గంజాయి రవాణా, పీడీఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణా, నకిలీ విత్తనాల రవాణా, పేకాట, కోడి పందేలపై గుడుంబా తయారీ, అక్రమ రవాణా, ఇల్లీగల్ ఫైనాన్స్, అనుమతి లేని చిట్ ఫండ్స్, భూ కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులను గురి చేయడం, అనుమతి లేని లేవుట్ వెంచర్ల నిర్మాణం, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పీడీ యాక్ట్ అమలకు కొంత మంది వ్యక్తుల జాబితా సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి నేర ప్రవృత్తి మార్చుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

యూపీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

ఓఆర్ఎస్ కలిపిన నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 26 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం మంచిర్యాల డీఎంహెచ్‌వో జీ సుబ్బారాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని రికార్డులు, డ్రగ్ స్టోర్‌ను పరిశీలించారు. అనంతరం సమావేశం నిర్వహించి, ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించాలని మెడికల్ అఫీసర్ అశోక్‌కు సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఏజీపీగా శ్రీనివాస్ నియామకం

శ్రీనివాస్

బెల్లంపల్లి రూరల్, ఏప్రిల్ 26 : బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పేరు పొందిన చొప్పదండి శ్రీనివాస్‌ను బెల్లంపల్లి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా బెల్లంపల్లి బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆయనను సన్మానించారు. ఏజీపీగా నియమితులైన న్యాయవాది చొప్పదండి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బెల్లంపల్లి కోర్టులో సీనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న తనను ప్రభుత్వం గుర్తించి, ఏజీపీగా అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గోపికిషన్ సింగ్ ఠాకూర్, చిప్ప మనోహర్, రాము, బాల కృష్ణ, గోలి శ్రీనివాస్, కే రాజేశ్, ఎస్‌వీ నరసింహారావు, సునీల్‌కుమార్, చేను రవికుమార్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్మారక స్థూపం ఏర్పాటు చేయాలి

- సింగరేణి సీఎండీకి టీబీజీకేఎస్ విజ్ఞప్తి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26 : సింగరేణిలో కార్మికుల అమరవీరుల స్మారక స్థూపాలు ఏర్పాటు చేయాలని సీఅండ్ ఎండీ ఎన్ బలరామ్‌కు టీబీజీకేఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ వినతి పత్రం అందించారని శ్రీరాంపూర్ ఏరియా స్టీరింగ్ కమిటీ సభ్యులు బండి రమేశ్, పానగంటి సత్తయ్య, పొగాకు రమేశ్ తెలిపారు. 134 ఏండ్ల సింగరేణి చరిత్రలో ఎందరో కార్మికుల ప్రాణత్యాగంతో నేడు సంస్థ అభివృద్ధి చెందడమే కాకుండా తెలంగాణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నదని పేర్కొన్నారు. కార్మికుల ప్రాణత్యాగాలకు గుర్తింపుగా సింగరేణి వ్యాప్తంగా యాజమాన్యం అధికారికంగా సింగరేణి కార్మికుల అమరవీరుల స్మారక స్థూపాలు, వనాలు ఏర్పాటు చేసి, అధికారికంగా కార్మికుల స్మారక దినోత్సవం, సంస్మరణ సభలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పది విద్యార్థులకు అవగాహన

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26 : పరీక్షల్లో ఫెయిల్ అయ్యారని జీవితంపై విరక్తి చెందడం, నిరాశ చెంది ఆత్మహత్యలు చేసుకోవద్దని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి హైస్కూల్‌లో శుక్రవారం పదితరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సత్యం, కరస్పాండెంట్ జక్కెన రమేశ్ పాల్గొన్నారు

కాలేయ దానం చేసిన ఆర్ఐ గోపి

ఆర్ఐ గోపిని సన్మానిస్తున్న కమాండెంట్ జమీల్ బాషా

హాజీపూర్, ఏప్రిల్ 26 : గుడిపేటలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ గోపి తన తల్లికి కాలేయాన్ని దానం చేసి, ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ జమీల్ బాషా శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు కుమార స్వామి, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గాలి దుమారంతో కూలిన విద్యుత్ స్తంభాలు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26 : శ్రీరాంపూర్ ఆర్కే–6 గుడిసెల్లోని పోచమ్మ దేవాలయం నుంచి సబ్‌స్టేషన్ వరకు ఉన్న నాలుగు విద్యుత్ స్తంభాలు, తీగలు శుక్రవారం ఉదయం గాలి దుమారానికి కుప్పకూలాయి. అక్కడి నిలిపి ఉన్న కార్లపై పడడంతో స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఆ సమయంలో బయట ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ఏఈ రామ్మూర్తి తెలిపారు. వెంటనే విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 26 : ఆర్టీసీ ఉద్యోగులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆర్టీసీ ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలేమన్ సూచించారు. ఆసిఫాబాద్ డిపోలో శుక్రవారం డీఎం విశ్వనాథ్‌తో కలిసి గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ 2.0ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపోలోని 331 మంది ఉద్యోగులకు, 57 మంది హైర్ బస్సు డ్రైవర్లకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వలంటీర్లు శ్రావణ్, ప్రేమల తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి కబడ్డీ శిక్షణ శిబిరం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26 : జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి శ్రీరాంపూర్ కాలనీ విశ్వశాంతి హైస్కూల్లో వేసవి కాల ఉచిత కబడ్డీ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఆ ఆసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి, కోశాధికారి చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 రోజులు శిక్షణ ఉంటుందని, పీఈటీ సదానందం 98491 24856 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

28న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు..

శ్రీరాంపూర్ కాలనీ విశ్వశాంతి హైస్కూల్లో ఈ నెల 28న జిల్లాస్థాయి కబడ్డీ సబ్ జూనియర్, జూనియర్ బాల, బాళికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు రాజేంద్రపాణి, చంద్రశేఖర్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా ప్రీమియర్ లిగ్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులు 28న ఉదయం 9 గంటలకు హైస్కూల్లో హాజరు కావాలని సూచించారు.

సీపీఆర్‌తో ప్రాణం పోసిన ఈఎంటీ, కానిస్టేబుల్

కాసిపేట, ఏప్రిల్ 26 : పోయిందనుకున్న ప్రాణం తిరిగివచ్చింది. ఈ ఘటన కాసిపేట పోలీస్ స్టేషన్ ముందు రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. పాత బెల్లంపల్లికి చెందిన మంద కళ్యాణ్ చక్రవర్తి బైక్‌పై బెల్లంపల్లి వైపు వెళ్తుండగా, కాసిపేట పోలీస్ స్టేషన్ ఎదుట వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. కళ్యాణ్ చక్రవర్తికి తీవ్ర గాయాలై, రోడ్డుపై పడిపోయాడు. పోలీసులు, స్థానికులు అక్కడికి చేరుకున్నారు. శ్వాస, గుండె ఆగిపోవడంతో మృతి చెందాడని అంతా అనుకున్నారు. కానీ, అక్కడే ఉన్న కాసిపేట కానిస్టేబుల్ రామకృష్ణ కళ్యాణ్ చక్రవర్తికి సీపీఆర్ చేయడం ప్రారంభించాడు. ఇంతలోనే అటుగా ఆటోలో వెళ్తున్న కాసిపేట 108 అంబులెన్స్ ఈఎంటీ ఆత్మారావు పరుగెత్తుకొని వచ్చి సీపీఆర్ చేశాడు. ఒక్కసారిగా గుండె తిరిగి కొట్టుకొని, శ్వాస తీసుకోవడంతో ప్రాణం